

వెంబడించి హత్య

పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడి హత్య జరిగింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఆరెపల్లిలో విషాదాన్ని నింపింది.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధ : 6:34

సహర్ గురు : 4:51

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.6 /24.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా బీఆర్‌ఎస్‌లో మౌనం

- తీహార్ జైలుకు కవిత ఘటనపై..



నిజామాబాద్‌నాగారం: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ రిమాండ్ కింద తీహార్ జైలుకు వెళ్లడం జిల్లాలోని బీఆర్‌ఎస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు అందరూ మౌనం పాటిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నిక ల్లో పార్టీ అధికారం కోల్పోగా ఇప్పటికే స్థాని క ప్రజాప్రతినిధులు పార్టీని వీడుతున్నారు. ఇదిలా ఉండగా ఇందూర్ రాజకీయ చరిత్రలోనే ఓ ప్రజాప్రతినిధిగా ఉంటూ కవిత జైలు కెళ్లడం మొదటిసారని అంటున్నారు.

స్త్రీనిధి లక్ష్యం కుదింపు

- రూ. 239 కోట్ల నుంచి రూ. 191 కోట్లకు తగ్గింపు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన స్త్రీనిధి రుణ లక్ష్యాన్ని సెర్ప్ శాఖ కుదించింది. మొత్తం రూ. 239 కోట్లు ఉన్న టార్గెట్‌లో రూ. 48 కోట్లు తగ్గించారు. దీంతో లక్ష్యం రూ. 191కోట్లకు చేరింది. ప్రస్తుతం జిల్లాలోని మహిళా సంఘాలకు రూ. 185 కోట్ల వరకు రుణాలను అందజేశారు. మిగులు లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా అధికారులు పూర్తి చేయాల్సి ఉంది.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

సాక్షి, కామారెడ్డి: నాగిరెడ్డిపేట మండలం జప్తి జాన్కంపల్లి అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయుడు జి.ప్రవీణ్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయుడిపై ఇటీవల పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినందున ఈ చర్య తీసుకున్నామని డీఈవో తెలిపారు.

నేడు 5కే రన్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా యువజన స్పోర్ట్స్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో 5కే రన్ నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటలకు పాత కలెక్టరేట్ నుంచి రన్ ప్రారంభమవుతుందని యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తెన్న తెలిపారు. ఓటర్ అవగాహనలో భాగంగా ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 200 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

మైనారిటీ గురుకులాలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం



ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఎనిమిదేళ్లలో మైనారిటీ విద్యార్థులకు రూ. 3,425 కోట్ల నిధులు కేటాయిస్తే ఇవి పూర్తిస్థాయిలో అందలేదన్నారు. దీంతో విద్యార్థులు చదువులో వెనకబడి ఉద్యోగాలు, నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారన్నారు. రాష్ట్రంలో అక్రమ పద్ధతిలో టీచర్ల నియామకం జరిగిందని ఆరోపించారు. మైనారిటీ గురుకులాల్లో జరిగిన అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఎంపీ అర్వింద్‌ పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని రైతులను మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ కూతురుకు పట్టిన గతే ఎంపీ అర్వింద్‌కు పడుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వైశాఖి సంతోష్, కాంగ్రెస్ నేత నరేందర్‌సింగ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న కమిటీ

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట మండలంలోని పల్లెబోగుడ తండాలో బాల్య వివాహాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అడ్డుకుంది. తండాకు చెందిన ఓ బాలిక వివాహం గురువారం జరగనుందని సమాచారం అందిందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీంతో తండాకు వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామని, బాల్య వివాహాలతో అనర్థాలను వివరించామని పేర్కొన్నారు.

ఫసల్ బీమాపై ఆశలు!

- పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం
- ఎన్నికల తర్వాత ఖరీఫ్ నుంచి అమలయ్యే అవకాశం
- ఈ పథకాన్ని వద్దనుకున్న గత ప్రభుత్వం



ఇటీవల కురిసిన వడగళ్ల వానకు నేలకొరిగిన వరిపంట

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జిల్లా రైతుల్లో ఆశలు పెరిగాయి. ఇదే పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వద్దనుకోగా, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు అమలు చేయడంపై కర్షకలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే వర్షాకాలం సీజన్ నుంచే ఫసల్ బీమాను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే, పార్లమెంట్ ఎన్నికల క్రతువు ముగియగానే పంటల బీమాకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. ఫసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టింది. దీనిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్నాళ్లు రాష్ట్రంలో అమలు చేయడానికి విముఖత చూపింది. ఒకవేళ అమలు చేసి ఉంటే గడిచిన ఇన్నేళ్లలో ప్రకృతితో పంట నష్టపోయిన వారికి పరిహారం అందేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కూడా ఇటీవల కురిసిన వడగళ్లకు వరి, మక్క, ఇతర పంటలు కలిపి 6,058 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. బోధన్, సాలూర, ఎడపల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, నిజామాబాద్ రూరల్, సిరికొండ, మెండోరా, వర్ని మండలాల్లో మొత్తంగా 44 గ్రామాల్లో 3,076 మంది రైతులు పంటలు నష్టపోయారు. ఫసల్ బీమా ఉండి ఉంటే బాధిత రైతులకు వెంటనే పరిహారం అందేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పంటల బీమాను అమలు చేయడానికి కసరత్తు చేస్తుండగా, విధివిధానాలు ఏ విధంగా ఉండనున్నాయో తెలియాల్సి ఉంది.

పత్తాలేని గతేడాది నష్టపరిహారం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా గతేడాది యాసంగిలో ప్రకృతి విపత్తుకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండుసార్లు వడగళ్లు రైతులను ముంచాయి. పంటనష్ట నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా తొలుత ఎకరానికి రూ. 10వేల చొప్పున 371 మంది రైతులకు రూ. 46లక్షలు అందాయి. ఆ తర్వాత కురిసిన వడగళ్లకు 8,702 మంది రైతులు 9,170 ఎకరాల్లో పంటలను నష్టపోయారు. ఇందుకు గాను జిల్లాకు రూ. 9.17కోట్లు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం ఈ నిధులను రైతులకు ఇవ్వలేదు. దీంతో పరిహారం రైతులు నిరాశగా ఉన్నారు.

బీమా ఉంటేనే ధీమా..



రైతులు సాగు చేస్తున్న పంటలకు నష్టం జరిగితే పరిహారం అందేలా కచ్చితమైన బీమా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమాను అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయం. షరతులు లేకుండా అన్ని పంటలకు బీమాను వర్తింపజేసి రైతువారీగా పరిహారం అందేలా చేస్తే బాగుంటుంది.

–భూమన్న, రైతు, దత్తాపూర్

పొరుగు ధాన్యంపై నిఘా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

సుభాష్‌నగర్: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం నిల్వ లు రాకుండా గట్టి నిఘా ఉంచుతామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి మంగళవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపడుతున్న చర్యలను సీఎస్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుత సీజన్‌లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. జిల్లాలో 466 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆ మేరకు సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశామని వివరించారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా ఆయా ప్రదేశాలను గుర్తించామన్నారు. కేంద్రాలు సాఫీగా కొనసాగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతోనూ సమావేశమై స్పష్టమైన సూచనలు చేశామని, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట నే రైస్‌మిల్లులకు చేరవేసేలా చొరవ చూపాల్సిందిగా సూచించామని సీఎస్ దృష్టికి తెచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం నిల్వలు రాకుండా గట్టి నిఘా కొనసాగిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా జిల్లాలో నాలుగు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఈ చెక్‌పోస్టుల ద్వారా కూడా పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం ప్రవేశించకుండా కట్టడి చేస్తామన్నారు.

కాగా, వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏప్రిల్ 10లోపు అన్ని కేంద్రాలు రైతులకు అందుబాటులోకి రావాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, నిర్లక్ష్యానికి తావివ్వకుండా రైతాంగ ప్రయోజనాలే కర్తవ్యంగా కొనుగోలు కేంద్రాలను నెలకొల్పాలని హితవు పలికారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్, డీఏవో వాజిద్ హుస్సేన్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి గంగూబాయి, సహకార శాఖ అధికారి పాపయ్య పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

- సర్వీస్ రికార్డు కోసం ఎంపీవో నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్
- రూ. 8 వేలు తీసుకుంటూ పట్టుబడిన హరిబాబు



ఎంపీడీవో సంతోష్‌రెడ్డి



సీనియర్ అసిస్టెంట్ హరిబాబు

కమ్మర్‌పల్లి: లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం కమ్మర్‌పల్లి, భిక్కనూరు మండలాల్లో కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా పనిచేసిన రావుట్ల బాగయ్య ఆరునెలల క్రితం బదిలీపై చందూర్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ఎంపీడీవోగా పనిచేసిన సంతోష్‌రెడ్డి.. బాగయ్య సర్వీస్ బుక్‌ను అయన పనిచేస్తున్న చోటుకు పంపాల్సి ఉన్నప్పటికీ పంపలేదు. ఈ విషయమై బాగయ్య పలుమార్లు ఎంపీడీవోకు మొరపెట్టుకున్నా కనికరించలేదు. చివరికి రూ.10 వేలు లంచం ఇస్తేనే సర్వీస్ బుక్‌ను పంపుతానని ఎంపీడీవో తెగేసి చెప్పగా.. చివరకు ఎంపీవో రూ. 8వేలకు ఒప్పుకున్నాడు. కొన్ని రోజులకు సంతోష్‌రెడ్డి బదిలీపై భిక్కనూరుకు వెళ్లిపోవడంతో.. సర్వీస్ బుక్ కోసం డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని బాగయ్య భావించాడు. కానీ బదిలీపై వెళ్లిన ఎంపీడీవో.. డబ్బులు ఇస్తేనే బాగయ్య సర్వీస్‌బుక్స్ పంపించాలని సీనియర్ అసిస్టెంట్ హరిబాబును ఆదేశించాడు. దీంతో డబ్బులు ఇవ్వకపోతే సర్వీస్ బుక్ పంపేది లేదని కార్యాలయానికి వచ్చిన బాగయ్యకు చెప్పాడు. చేసేదిలేక బాగయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ నేపథ్యంలో బాగయ్య నుంచి రూ. 8వేలు తీసుకుంటుండగా హరిబాబును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇదే సమయంలో భిక్కనూరులో ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని కమ్మర్‌పల్లికి తీసుకొచ్చి విచారించారు. పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తామని ఏసీడీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జిల్లా కేంద్రంలోని సంతోష్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు కొనసాగాయి.

నాలుగున్నర గంటలపాటు వేచి చూసి..

భిక్కనూరు: లంచం తీసుకుంటుండగా కమ్మర్‌పల్లి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ హరిబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.. భిక్కనూరు ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు నాలుగున్నర గంటలపాటు వేచిచూశారు. ఉదయం 11 గంటలకు ఏసీబీ అధికారులు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఎంపీడీవో మోటాట్‌పల్లి, తిప్పాపూర్ గ్రామాల పర్యటనకు వెళ్లినట్లు సిబ్బంది చెప్పడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని చెట్టు నీడలో తమ వాహనాన్ని పెట్టుకుని కూర్చున్నారు. సరిగ్గా మూడు గంటలకు సంతోష్‌రెడ్డి కార్యాలయానికి చేరుకొని తన గదిలో కూర్చున్నారు. కమ్మర్‌పల్లిలో సీనియర్ అసిస్టెంట్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు ఇక్కడ వేచి ఉన్న అధికారులకు సమాచామి చ్చారు. వారు వెంటనే ఎంపీడీవోను అదుపులోకి తీసుకొని కమ్మర్‌పల్లికి తరలించారు.

డీసీసీబీ చైర్మన్‌గా కుంట రమేశ్‌రెడ్డి





రమేశ్‌రెడ్డికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న డీసీవో, చైర్మన్ ఎన్నిక సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు

- చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించిన డీసీవో శ్రీనివాస్‌రావు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసిన చైర్మన్, డైరెక్టర్లు

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్‌గా కుంట రమేశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ పదవికి మంగళవారం డీసీవో శ్రీనివాస్‌రావు ఎన్నిక నిర్వహించారు. రమేశ్‌రెడ్డి ఒక్కరే నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం నామినేషన్ స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు సమయమిచ్చారు. కేవలం ఒకే నామినేషన్ దాఖలు కావడంతో డీసీసీబీ చైర్మన్‌గా వేల్పూర్ సొసైటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. పోచారం భాస్కర్‌రెడ్డిపై మార్చి 4న డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈనెల 21న తీర్మానం నెగ్గిన విషయం విదితమే. ఖాళీ అయిన చైర్మన్ స్థానానికి ఎన్నిక నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం డైరెక్టర్ల సమక్షంలో నియామకపత్రం అందజేశారు. రమేశ్‌రెడ్డితో డీసీవో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకు ముందు నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి 17 మంది డైరెక్టర్లు హాజరయ్యారు.

నూతన చైర్మన్‌కు అభినందనలు..

డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన రమేశ్‌రెడ్డిని కాంగ్రెస్ నేతలు, ఇతర సీనియర్ నాయకులు, సొసైటీ సీఈవోలు, డీసీసీబీ ఎంప్లాయీస్ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, సీనియర్ నాయకులు అంతిరెడ్డి రాజారెడ్డి, మాదాపూర్ వెంకట్‌రెడ్డి, జక్క రాజేశ్వర్‌లతో పాటు నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సన్మానించారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని తన నివాసంలో నూతన చైర్మన్ రమేశ్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ చైర్మన్లు, బ్యాంకు సిబ్బంది, రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

తొలిరోజే పాలకవర్గ సమావేశం

చైర్మన్‌గా ఎన్నికైన మొదటిరోజే రమేశ్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులో రుణాలు పొందిన రైతులకు ఇన్సూరెన్స్‌ను రూ. 2లక్షలకు పెంచుతూ తీర్మానం చేశారు. అలాగే డైరెక్టర్లు, సిబ్బంది హెల్త్ ఇన్సూరెన్స్‌పై నిర్ణయం తీసుకున్నారు.

రైతులకు మరింత సేవచేసే అదృష్టం దక్కింది



రైతులకు మరింత సేవ చేసే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తాను. డైరెక్టర్లు, రైతులకు అందుబాటులో ఉంటాను. తన ఎన్నికకు సహకరించిన బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బాన్సువాడ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లకు కృతజ్ఞతలు.

– కుంట రమేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

సామాన్యుడికి బ్యాంకు బురిడీ..!

- వేలం పాటలో భూమి కొనుగోలు
- కాగితాలపైనే భూమి.. మోకాపై రామాలయం
- అధికారులకు తెలిసినా తప్పుడు నివేదికలు
- 11 ఏళ్లుగా న్యాయం కోసం తిరుగుతున్న బాధితుడు

నిజామాబాద్‌నాగారం: బ్యాంకులను బురిడీ కొట్టించిన కేటుగాళ్లను చూశాం.. కానీ జిల్లా కేంద్రంలో బ్యాంకే ఓ సామాన్యుడిని బురిడీ కొట్టించిన ఘటన వెలుగు చూసింది. బ్యాంకు అధికారులు నిర్వహించిన వేలం పాటలో స్థలాన్ని దక్కించుకున్న నగరానికి చెందిన ఓ వ్యక్తి.. 11 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నాడు. ఇప్పటికీ బాధితుడికి న్యాయం జరగకపోవడం గమనార్హం.

జరిగిందిలా..

నిజామాబాద్ నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులోని మూడ సరోజ అనే మహిళకు 840 గజాల భూమి ఉంది. ఇందులో 440 గజాల్లో కోదండ రామాలయం ఉంది. మరో 400 గజాల భూమిలో ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్సు ఉన్నాయి. అయితే గుడికి సంబంధించిన సుమారు 220 గజాల భూమిని బ్యాంకుకు తనఖా పెట్టింది. నగరంలోని శివాజీనగర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బ్యాంకు వాల్యూయర్ శ్రీనివాస్ వర్మతో కలిసి అప్పటి బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ దివాకర్‌రెడ్డిలకు ఖాళీ భూమి లేకున్నా.. ఉన్నట్లు తప్పుడు రిపోర్టులు చూపించి 2010లో రూ. 2 లక్షల లోన్ తీసుకున్నారు. వాస్తవానికి అక్కడ 36 ఏళ్లుగా కోదండరామాలయం ఉంది. సరోజ లోన్ తిరిగి కట్టకపోవడంతో బ్యాంకు అధికారులు 2013 జూలైలో నోటీసులిచ్చారు. అయినా స్పందించకపోవడంతో ఇదే ఏడాది వేలం పాట నిర్వహించారు. అందులో నగరానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి పాల్గొని రూ. 8 లక్షలు చెల్లించి ఆ భూమిని తన సొంతం చేసుకున్నాడు. భూమికి సంబంధించిన కాగితాలు ఇచ్చిన అధికారులు.. మోకాపై భూమిని మాత్రం చూపించలేకపోయారు.

కోల్‌కతాలోని డీఆర్‌టీ కోర్టును ఆశ్రయించిన బాధితుడు

తనకు జరిగిన అన్యాయంపై 11 ఏళ్లుగా చెప్పులరిగేలా బాధితుడు తిరుగుతున్నాడు. బ్యాంకు అధికారులకు, జిల్లా, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించాడు. అయినా న్యాయం జరగకపోవడంతో హైకోర్టుకు వెళ్లాడు. బాధితుడికి న్యాయం చేయాలని హైకోర్టు ఆదేశించినా బ్యాంకు అధికారులు పెడచెవిన పెడుతూ వచ్చారు. దీంతో విసిగిపోయిన శ్రీనివాస్ చివరకు న్యాయం కోసం కోల్‌కతాలోని డీఆర్‌టీ కోర్టుకు సైతం వెళ్లాడు. ప్రస్తుతం కేసు కోర్టులో విచారణలో ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు భూమి చూపించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

అధికారుల తప్పుడు రిపోర్టులు..

తాను కొనుగోలు చేసిన భూమిని చూపించాలని శ్రీనివాస్ పలుమార్లు శివాజీనగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వెళ్లాడు. అయితే బ్యాంకు అధికారులు సంబంధిత తహసీల్దార్, సర్వేయర్‌లతో పంచనామా చేసి అక్కడ గుడి లేదని.. ఖాళీ స్థలం ఉందని తప్పుడు రిపోర్టు ఇచ్చారు. అదేవిధంగా డ్రాయింగ్‌లో బ్యాంకు వాల్యూయర్ శ్రీనివాస్ వర్మ, రెండో బ్యాంకు వాల్యూయర్ రవి మరో లోకేషన్ చూపించారు. ఇలా తప్పుడు రిపోర్టులు ఇప్పించారు. వాస్తవానికి అక్కడ ఆలయం ఉన్న విషయం ఇటు బ్యాంకు అధికారులకు, అటు రెవెన్యూ అధికారులకు తెలిసినా.. విషయాన్ని గోప్యంగా ఉంచారు. స్థలం చూపించాలని బాధితుడు బ్యాంకు అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోకపోవడం గమనార్హం.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌కు శ్రీకారం



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహణ

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు.

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు(పీవో), సహాయ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీవో)లను, ఇతర పోలింగ్ అధికారులు(ఓపీవో)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఆరు సెగ్మెంట్లకు గాను మొత్తం 7,711 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ చేపట్టారు. వీరిలో పీవోలు 2008 మంది ఉండగా, ఏపీవోలు 2056, ఓపీవోలు 3647 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా పోలింగ్ నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సీపీవో మల్లికార్జున్, శ్రీకాంత్, ఎన్‌ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామియాదవ్‌కు కిషన్‌రెడ్డి అభినందన



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఆదిలాబాద్‌ లోక్‌సభ నియోజకవర్గ సహ–సమన్వయకర్తగా నియమితులైన మాదాసు స్వామి యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి అభినందించారు. ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్‌ నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశానికి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేసినట్లు స్వామియాదవ్‌ తెలిపారు. తప్పకుండా ఆదిలాబాద్‌ లోక్‌సభ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా స్వామియాదవ్‌ను కిషన్‌రెడ్డి సన్మానించి అభినందించారు.

తెయూ యూత్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌గా లావణ్య



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్‌ కరిమిండ్ల లావణ్య డైరెక్టర్‌ ఆఫ్‌ కల్చరల్‌ యాక్టివిటీస్‌, యూత్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. వర్సిటీ ఇన్‌చార్జీ వీసీ బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి మంగళవారం లావణ్యకు నియామక ఉత్తర్వులు అందజేశారు. లావణ్య గతంలో బాలికల హాస్టల్‌ వార్డెన్‌గా, అడిషనల్‌ కంట్రోలర్‌గా, ఉమెన్‌సెల్‌ డైరెక్టర్‌గా, పబ్లికేషన్‌ సెల్‌ కో – ఆర్డినేటర్‌గా, సౌత్‌ క్యాంపస్‌ ప్రిన్సిపల్‌గా తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులుగా, బీవోఎస్‌ చైర్‌పర్సన్‌గా ఆయా పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారు. కల్చరల్‌ డైరెక్టర్‌, యూత్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌గా నియమితులైన లావణ్యను అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

- ఏప్రిల్‌ 1 నుంచి అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు
- రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడొద్దు
- అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

సుభాష్‌నగర్‌: యాసంగి ధాన్యం సేకరణ సజావుగా సాగేలా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ సూచించారు. ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయా శాఖల అధికారులు, సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలు, ఐకేపీ సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్‌ 1 నుంచి వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్నిచర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో 462 కొనుగోలు కేంద్రాల ద్వారా 6 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి, మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. గతంలో లాగా నియమ, నిబంధనలు అమల్లో ఉంటాయని, ఈసారి కొత్తగా సెకండ్‌ ఓటీపీలో ఐరిస్‌ను కాప్చర్‌ చేస్తామని వివరించారు. రైతుల నుంచి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

కేంద్రాలను అధికారులే ప్రారంభించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడంతో ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించొద్దని, అధికారులే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అదనపు కలెక్టర్‌ సూచించారు. ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపరిచే ప్రయత్నాలను ఎంత మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అదనపు కలెక్టర్‌ అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్‌, సివిల్‌ సప్లయ్‌ డీఎం జగదీశ్‌, జిల్లా మార్కెటింగ్‌ అధికారిణి గంగూబాయి, సహకార శాఖ అధికారి పాపయ్య పాల్గొన్నారు.

హెచ్చరించినా పట్టింపేది?


రాకాసీపేట్‌లో మొరం తవ్వడంతో ఏర్పడిన గుంత

బోధన్‌టౌన్‌(బోధన్‌): నియోజకవర్గంలో ఇసుక, మొరం అక్రమరవాణాను అడ్డుకోవాలని, ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండాపోతోంది. మొరంతోపాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అధికారయంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అనుమతించిన ఇసుక పాయింట్ల నుంచి వే బిల్లులపై పగలు అధికారికంగా, రాత్రి వేళల్లో అనధికారికంగా ఇసుక రవాణా అవుతోంది. ఇసుకతోపాటు మొరం తరలిపోతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు అంటున్నారు. రాకాసీపేట్‌ శివారులోని బెల్లాల్‌ చెరువు సమీపం నుంచి మొరాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటీవల నాలుగు ఇసుక ట్రాక్టర్లను, సోమవారం రాత్రి రెండు మొరం టిప్పర్లను పోలీసులు పట్టుకున్న ఘటనలు ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

మొరం టిప్పర్ల పట్టివేత

బోధన్‌టౌన్‌(బోధన్‌): అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను బోధన్‌లో పట్టణంలో మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌ కాలనీ మీదుగా మొరం టిప్పర్లు నడుస్తున్నాయన్న సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.


పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో టిప్పర్లు

కమ్యూనిస్టు నేత 'మువ్వా' కన్నుమూత

- మృతదేహాన్ని మెడికల్‌ కళాశాలకు అప్పగించనున్న కుటుంబ సభ్యులు


నాగేశ్వర్‌రావు (ఫైల్‌)

మాక్లూర్‌: కమ్యూనిస్టు నాయకుడు మువ్వా నాగేశ్వరరావు(88) మంగళవారం ఉదయం అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. స్వగ్రామమైన మండలంలోని కొత్తపల్లిలో నాగేశ్వరరావు భౌతిక కాయాన్ని నాయకులు, అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. చదువుకునే రోజుల నుంచి కమ్యూనిస్ట్‌ భావాజలం వైపు ఆకర్షితులైన నాగేశ్వరరావు అంచెలంచెలుగా ఎదిగారు. కమ్యూనిస్టు ఉద్యమాలతోపాటు పౌరహక్కుల, ఉపాధ్యాయ సంఘాల్లో చురుగ్గా పని చేశారు. మరో వైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారు. గుంటూరు జిల్లా పెదనంది పాడులో 1936 ఏప్రిల్‌ 14న జన్మించిన ఆయన.. ఉద్యోగరీత్యా తెలంగాణకు వచ్చారు. ఇక్కడే సహచర ఉద్యోగిని తులసిని వివాహం చేసుకోగా, ఇద్దరు కొడుకులు శరత్‌, సురేశ్‌ ఉన్నారు. నాగేశ్వర్‌రావు కోరిక మేరకు వైద్య కళాశాలకు ఆయన భౌతికకాయాన్ని బుధవారం అప్పగిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఫిజిక్స్‌ పరీక్ష నిర్వహించగా, 22,024 మంది విద్యార్థులకు గాను 21,977 మంది హాజరుకాగా, 47 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాలుగు పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.

బీపీఈడీ సెమిస్టర్స్‌..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు.

ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రంలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 81 మంది విద్యార్థులకుగాను 78 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు.

ముగిసిన పోషణ్‌ పక్వాడా



నిజామాబాద్‌నాగారం: ఈనెల 9న ప్రారంభమైన పోషణ్‌ పక్వాడా కార్యక్రమం మంగళవారం ముగిసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మంగళవారం అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం మరింత పకడ్బందీగా చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌ బీ, వైద్యారోగ్య శాఖ అధికారి సుదర్శనం, సమగ్ర శిక్షాఅభియాన్‌ సెక్టోరల్‌ ఆఫీసర్‌ పి శ్రీనివాస్‌, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖా సహాయ అధికారి టి కిషన్‌, జిల్లా గిరిజన సంక్షేమాధికారి నాగారావు, మిషన్‌ భగీరథ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ కే రాకేశ్‌, ఆయూష్‌ డిపార్ట్‌మెంట్‌ కో ఆర్డినేటర్‌ ఎస్‌ రామ్మోహన్‌, పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఐకేపీ ఏపీఎంలు, మహిళాశిశు సంక్షేమశాఖ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ్‌అభియాన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్‌ 2 వరకు నీటి విడుదల!


ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ జోన్‌ – 2కు(ఎల్‌ఎండీ ఎగువ భాగం) ఏప్రిల్‌ 2వ తేదీ వరకు నీటి విడుదల చేపడుతామని, ఇదే చివరి తడని ప్రాజెక్ట్‌ ఎస్‌ఈ శ్రీనివాస్‌, ఈఈ చక్రపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్‌ – 2 ఆయకట్టు రైతులకు నీరందలంటే జోన్‌ – 1లోని డీ – 5 నుంచి డీ – 53 వరకు ఉన్న రైతులు తూములను తప్పకుండ మూసి ఉంచాలని, అధికారులకు సహకరించాలని కోరారు. కాకతీయ కాలువ ద్వారా నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, అటువైపు వెళ్లొద్దని సూచించారు.

తగ్గుతున్న నీటి మట్టం..

ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 7 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 347, గుత్పలిఫ్ట్‌ ద్వారా 146, ముంపు గ్రామాల లిఫ్ట్‌ ద్వారా 200, సరస్వతీ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు వెళ్తుండగా, ఆవిరి రూపంలో 432 నీరుపోతుండగా, ప్రాజెక్ట్‌ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1062.9 (17.18 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

ఒకటో తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్ష ఫీజును ఏప్రిల్‌ ఒకటో తేదీ వరకు చెల్లించవచ్చని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం అన్ని సబ్జెక్టుల ఫీజు మొత్తం రూ.600, ప్రాసెసింగ్‌ ఫీజు రూ.200 ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని, ఫీజు షెడ్యూల్‌ వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌ www.telangana university. ac.inలో పొందుపర్చినట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌

ఆరుగురు యువకులపై అత్యాచారయత్నం కేసు నమోదు

బిచ్కుంద(జుక్కల్‌) : మండలంలోని చిన్నదేవాడ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులపై అత్యాచార యత్నం కేసు నమోదైనట్లు ఎస్సై ఓమన్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వాజిద్‌నగర్‌కు చెందిన ఓ రైతు చిన్నదేవడ గ్రామ శివారులోని వ్యవసాయభూమిని కౌలుకుతీసుకున్నాడు. సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం సదరు రైతు తన భార్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా, దారి మధ్యలో మద్యం సేవిస్తున్న దేవడ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు పోకిరీ చేష్టలు చేస్తూ వారివెంటబడ్డారు. ఈ క్రమంలో రైతు యువకులను నిలదీయగా ఆయనపై దాడి చేశారు. బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆరుగురు యువకులపై అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాలో సోమవారం రాత్రి నివాసపు గుడిసె దగ్ధమైంది. బాదవత్‌ కిషన్‌కు చెందిన గుడిసెలో షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు అంటుకోవడంతో వంట సామగ్రి, దుస్తులు, బియ్యం, వడ్లు, రూ.10వేల నగదు, అరతులం బంగారం, పట్టాపాస్‌పుస్తకాలు కాలిపోయాయని ఆర్‌ఐ బాలయ్య తెలిపారు. మొత్తం రూ.1.49 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పంచనామాలో పేర్కొన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మాక్లూర్‌: మండలంలోని ధర్మోరా శివారులోగల సామెల్‌ చెరువులో మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. గుత్ప ఎత్తిపోతల నీటిని సామెల్‌ చెరువులోనికి మళ్లించారని, నీటి ప్రవాహంలో యువకుడి మృత దేహం కొట్టుకుని వచ్చి ఉంటుందని ఎస్సై సుధీర్‌రావు అనుమానా వ్యక్తం చేశారు. పశు కాపర్ల సమాచారం మేరకు పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు జీన్స్‌ప్యాంటు, ఆకుపచ్చ లైనింగ్‌ షర్టు ఉందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై అన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి మార్నింగ్‌కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. 10 మందికి రూ.11,300 జరిమానా, గౌతంనగర్‌కు చెందిన ఒకరితోపాటు నవీపేట్‌ మండలం అనంతగిరికి చెందిన మరొకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్‌

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వృద్ధుడిపై దాడిచేసి రూ.2వేలు, సెల్‌ఫోన్‌ ఎత్తుకెళ్లిన కేసులో ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌ సీఐ నరహరి తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సీఐ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పూలాంగ్‌కు చెందిన అష్ఫక్‌ అహ్మద్‌, అజౌజ్‌ఖాన్‌ వృద్ధులను ఆటోలో ఎక్కించుకొని బంగారం, డబ్బులు దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. శ్రీనివాస్‌నగర్‌కాలనీకి వెళ్లేందుకు వేచిఉన్న ఓ వృద్ధుడిని ఇటీవల కోర్టు చౌరస్తాలో ఆటోలో ఎక్కించుకున్నారు. గిరిరాజ్‌ కళాశాల వద్ద నిర్మానుష్యప్రాంతానికి తీసుకెళ్లి వృద్ధుడిపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్‌ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్‌ పాల్గొన్నారు.

వెంబడించి.. కత్తులతో పొడిచి హత్య

- రామేశ్వర్‌పల్లి సమీపంలో ఘటన
- మృతుడు ఆరెపల్లికి చెందిన యువకుడు


నవీన్‌ (ఫైల్‌)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామన్‌, రోదిస్తున్న మృతుడి తండ్రి, బంధువులు

కామారెడ్డి క్రైం: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారికాచి వెంబడించి దారుణంగా హత్య చేశారు. కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి సమీపంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచ మండలం ఆరెపల్లికి చెందిన నవీన్‌(25) కామారెడ్డిలో ఆటో నడిపిస్తున్నాడు. రోజులాగే మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి ఆటోలో బయల్దేరిన నవీన్‌ గ్రామ శివారులోని పొలం వద్ద తన తల్లిని దింపి కామారెడ్డి వైపు వెళ్తున్నాడు. ముఖానికి ముసుగులు ధరించి బైక్‌పై వేగంగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆటోను వెంబడించి ఆపారు. అటుగా వెళ్తున్న వారు గొడవ ఏమిటని ప్రశ్నించగా.. ఏమీ లేదని బదులిచ్చారు. ఆ తరువాత రోడ్డు పక్కన ఖాళీ స్థలంలోకి నవీన్‌ను తీసుకెళ్లి కత్తులతో పొడిచి హత్యచేసి పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత అటుగా వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించగా, ఘటనాస్థలాన్ని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, రూరల్‌ సీఐ రామన్‌, దేవునిపల్లి ఎస్సై రాజు పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌ బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనాస్థలానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఘటనాస్థలంలో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాత కక్షలే కారణమా..?

మృతుడు నవీన్‌కు అదే గ్రామానికి చెందిన భువనగిరి మధు కుటుంబానికి మధ్య పాతకక్షలు ఉన్నట్లు తెలిసింది. రెండు కుటుంబాలు గతంలో ఎదురెదురు ఇళ్లలో ఉండేవి. కొద్ది రోజులుగా మధు కుటుంబం మరో కాలనీలో ఉంటోందని, మధుతో పాటు అతడి బావమరిది పొందుర్తి ప్రవీణ్‌ తన కుమారుడిని హత్య చేశారని మృతుడు నవీన్‌ తండ్రి నర్సయ్య, బంధువులు ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, త్వరలోనే కేసు ఛేదిస్తామని సీఐ రామన్‌ అన్నారు.

రూ.2.29 లక్షల నగదు పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పోతంగల్‌ శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌ పోస్టు వద్ద రూ.2.29లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. మంగళవారం మహారాష్ట్ర వైపునుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా, నాందెడ్‌కు చెందిన నగేశ్‌ షెట్కార్‌ వద్ద నగదు లభించిందన్నారు. నగదును సీజ్‌చేసి బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి అప్పగించినట్లు తెలిపారు. ఎలక్షన్‌ కోడ్‌ అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదును వెంటపెట్టుకొవద్దని, ఒకవేళ ఉంటే ధ్రువీకరణపత్రాలు దగ్గర ఉంచుకోవాలని ఎస్సై సూచించారు.

మద్యం పట్టివేత

డిచ్‌పల్లి: అక్రమంగా తరలిస్తున్న 54.6లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. సుద్దులం గ్రామానికి చెందిన కొత్తపల్లి సందీప్‌ అక్రమంగా మద్యం తరలిస్తుండగా మండల కేంద్రం శివారులోని సీఎంసీ కళాశాల సమీపంలోని దేవపల్లి వెళ్లే రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసిక ఇబ్బందులతో ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: పురిట్లోనే కుమారుడు మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన సమీరా (20) రెండేళ్ల క్రితం అనూజ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. మూడు నెలల క్రితం వారికి ఓ కుమారుడు జన్మించి చనిపోయాడు. అప్పటినుంచి మానసికంగాకుంగిన సమీరా నిత్యం బాధపడేది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి జాకీయాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన ముస్కాన్‌ అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఖుసునుమా బేగం కుటుంబం ఏడాదిన్నర క్రితం ఎల్లారెడ్డి పట్టణానికి వచ్చి పాప్‌కార్న్‌ విక్రయిస్తూ జీవిస్తోంది. చెప్పిన మాట వినడం లేదని తల్లి ముస్కాన్‌ను ఈనెల 20వ తేదీన మందలించగా, రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ


ప్రశాంత్‌ (ఫైల్‌)


ఘటనాస్థలంలో లారీ, బైక్‌

ఎల్లారెడ్డి: బైక్‌ను లారీ వెనక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్‌ మండలం హసన్‌పల్లికి చెందిన యువకుడు గూడెం ప్రశాంత్‌ (21) ఎల్లారెడ్డిలో నిత్యావసర వస్తువులను తీసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా, ఎల్లారెడ్డి వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రశాంత్‌ లారీ చక్రాల కిందపడి మృతి చెందాడు. మృతుడి తల్లి సత్తెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.